## క్లుప్తంగా

### శ్రీనృసింహ దీక్షల ఏర్పాట్ల పరిశీలన



దేవస్థానం ఈఈ, ఏఈవోలతో చర్చిస్తున్న ఈవో త్రినాథరావు

**సింహాచలం:** శ్రీనృసింహ దీక్షల ఏర్పాట్లను ఆదివారం ఈవో త్రినాథరావు పరిశీలించారు. సోమవారం నుంచి 41 రోజుల శ్రీనృసింహ దీక్షలు ప్రారంభం కానుండటంతో దీక్షాధారులకు మాలధారణ, తులసిమాలల పంపిణీ తదితర అంశాలపై ఆలయ అర్చక, అధికారులతో చర్చించారు. దీక్షాధారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో సింహగిరికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు ఎస్.ఆనందకుమార్, రాంబాబు, సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

### అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపి, ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

**వైభవంగా నిత్యకల్యాణం**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యాధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

### కమ్యూనిస్ట్ నేత అనంతరాజుకు నివాళి



అనంతరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

**పెందుర్తి:** దివంగత సీపీఐ నేత యెరిపల్లి అనంతరాజు 13వ వర్ధంతి సందర్భంగా సుజాతనగర్ దరి భగత్‌సింగ్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరాజు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. పెందుర్తి ప్రాంతంలో పేద ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు ఎస్.అసిరినాయుడు, ఎం.రాము, రామారావు, వై.రాంబాబు, దుర్గారావు, మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



# అడుగుకో గొయ్యి.. గజానికో గుంత!



చింతలగ్రహారం వద్ద అధ్వానంగా వేపగుంట-పినగాడి రహదారి

**శిథిలావస్థలో వేపగుంట-పినగాడి రోడ్డు**

'రెండు మూడు రోజుల్లో వేపగుంట-పినగాడి రోడ్డు పనులు ప్రారంభిస్తాం. ముందుగా జీవీఎంసీ పరిధిలో ఉన్న మేరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. తర్వాత కొద్ది రోజుల్లోనే మిగిలిన రోడ్డు పునరుద్ధరణ పనులు మొదలెడతాం. అతి త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం'

– ఈ ఏడాది జూన్ 27న వేపగుంట – పినగాడి రహదారి పరిశీలనలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వ్యాఖ్యలు

'వేపగుంట-పినగాడి రహదారి ఛిద్రమవడంతో ప్రజల ఇక్కట్లు తెలుసుకున్నాం. నా పరిధి వరకు ఉన్న రోడ్డు పనుల నిమిత్తం మా ప్రయత్నంతో జీవీఎంసీ నుంచి రూ.1.50 కోట్లు మంజూరు చేయించుకున్నాం. వేపగుంట కూడలి నుంచి జీవీఎంసీ పరిధి ఉన్న చింతలగ్రహారం వంతెన వరకు ఆయా నిధులతో పనులు ప్రారంభిస్తాం. శరవేగంగా పూర్తి చేస్తాం.'

– ఈ ఏడాది మార్చిలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రకటన.

'వేపగుంట-పినగాడి రహదారి మరమ్మతుల నిమిత్తం కమిషనర్ రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. పనుల నిమిత్తం టెండర్ కూడా ఆహ్వానించాం. పనులు ప్రారంభిద్దామని అనుకున్న తరుణంలో తమ పరిధిలో జీవీఎంసీ ఎలాంటి పనులు చేపట్టరాదంటూ ఆర్ అండ్ బీ అధికారులు జీవీఎంసీకి ఓ లేఖ పంపించారు. దీంతో పనులు ఆపేయాల్సి వచ్చింది.'

– ఈ ఏడాది ఆగస్టులో జీవీఎంసీ డీఈ విజయ్‌కుమార్ వివరణ ఇది.

- జీవీఎంసీ నిధులు మంజూరై టెండర్ పూర్తయిన వైనం
- మా పరిధిలో మీరెలా మరమ్మతులు చేస్తారంటూ ఆర్ అండ్ బీ కొర్రీ
- పట్టించుకోని కూటమి ప్రజాప్రతినిధులు
- యంత్రాంగం సమన్వయ లోపంతో ప్రజలకు ఇక్కట్లు



గోతులమయంగా రోడ్డు

**పెందుర్తి:** నియోజకవర్గంలోని అత్యంత కీలకమైన రహదారుల్లో వేపగుంట-పినగాడి రోడ్డు ఒకటి. చోడవరం, సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి ప్రాంతాల నుంచి నగరానికి చేరుకోవాలంటే ఈ మార్గాన్నే ప్రజలు ఎక్కువగా ఆశ్రయిస్తారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అలాంటి రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. దీనిపై రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**రెండేళ్ల క్రితమే నిధులు మంజూరు**

ఈ రహదారిని పునర్నిర్మించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండేళ్ల క్రితమే రూ.11 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి కాంట్రాక్టర్(ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే) ఏవేవో కారణాలు చూపించి రోడ్డు నిర్మాణాన్ని తాత్సారం చేస్తూ వచ్చారు. అనంతరం కనీసం మరమ్మతులైనా చేపడదామని జీవీఎంసీ ముందుకు వచ్చి రూ.1.50 కోట్లు నిధులు కేటాయించింది. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్న సమయంలో ఆర్ అండ్ బీ అధికారులు కొర్రీ వేశారు. మా పరిధిలోని రోడ్డుపై మీ పెత్తనం ఏంటని జీవీఎంసీ అధికారులకు నోటీసులు జారీ చేయడంతో రోడ్డు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

**పనులు ఎప్పుడు మొదలయ్యేనో..!**

గత ప్రభుత్వ హయాంలో నిధులు విడుదలైనా కాంట్రాక్టర్ తాత్సారం, తర్వాత ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభించేందుకు జీవీఎంసీ అధికారులు సన్నాహాలు చేశారు. జూన్ 27న ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సైతం రెండు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని ప్రకటించారు. దీంతో ప్రజలు రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇది జరిగి ఐదు మాసాలవుతున్నా.. అడుగు కూడా ముందుకు కదల్లేదు.

### వర్షాలకు భారీ గుంతలు

దాదాపు 10 కిలో మీటర్ల విస్తీర్ణం ఉన్న వేపగుంట-పినగాడి రహదారి పూర్తిగా గోతులమయం అయింది. అడుగడుగునా ఛిద్రమై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. వాహనాలు గోతుల్లో దిగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాల మీద వెళ్లేవారి కష్టాలు చెప్పనలవికానివి. వర్షాలు కురిశాయంటే.. రోడ్డేదో.. గొయ్యేదో.. కూడా గుర్తు పట్టలేని పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరీ దారుణంగా మారింది. రాళ్లు తేలి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



శ్రీరాంపురం వద్ద రోడ్డు దుస్థితి

### మరమ్మతులు చేసుకుంటున్నాం



మేం స్థానికంగా పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్నాం. రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. అందుకే అడపాదడపా మేమే మరమ్మతులు చేస్తున్నాం. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. కానీ ఫలితం లేదు. ఇప్పటికైనా స్పందించి రోడ్డును బాగుచేయాలి.

– సంతోష్, చింతలగ్రహారం

### ప్రమాదాలు జరుగుతున్నాయి



పినగాడి-వేపగుంట మార్గంలో తరచూ ప్రయాణం చేస్తుంటాం. ఇటు విశాఖ నగరానికి వెళ్లాలన్నా.. అటు అనకాపల్లి వెళ్లాలన్నా ఈ రోడ్డే మాకు ఆధారం. కానీ రోడ్డు పూర్తిగా పాడవంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రోడ్డును బాగుచేస్తే స్థానికులతోపాటు, వేలాది మంది వాహనదారులకు ఉపయోగంగా ఉంటుంది.

– జగదీష్, కరకవానిపాలెం

### ప్రశాంతంగా 'క్లాట్-25'



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఎన్‌ఎల్‌యూ వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

**సబ్బవరం:** దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్‌ఎన్‌ఎల్‌యూ)లో జాతీయ స్థాయి కామన్ లా ఎంట్రన్స్ టెస్ట్(క్లాట్)–25 ఆదివారం ప్రశాంతంగా జరిగింది. యూనివర్సిటీలోని రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పరీక్షా కేంద్రా(విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూల్, రాజమండ్రి)లలో నిర్వహించిన పరీక్షకు 1,100 మంది విద్యార్థులు హాజరయ్యారు. విశాఖలోని డీఎస్‌ఎన్‌ఎల్‌యూలో 250 మంది పరీక్ష రాశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

### బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ అనిల్‌కుమార్



**సబ్బవరం:** గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ డి.అనిల్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్రమ మద్యం అమ్మకాలు జరగకుండా ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బెల్ట్ షాపుల ఏర్పాటుకు గ్రామాల్లో వేలం పాటలు నిర్వహిస్తే నిర్వాహకులు, మధ్యవర్తులు, వేలం పాటలు పాడుకున్న వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గత నెల 7 నుంచి 30 వరకు సర్కిల్ పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో నిర్వహించిన దాడుల్లో 13 మందిపై కేసులు నమోదుచేసి, కోర్టుకు తరలించామన్నారు. వారి నుంచి సుమారు 40 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్ట్ షాపుల సమాచారం అందించి, ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

# సూపర్ సిక్స్‌తో కూటమి వంచన

- మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి
- ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమన్న చంద్రబాబు
- 6 నెలల్లోనే ప్రజలపై రూ.15,485 కోట్ల భారం
- వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పి.. ఇప్పుడు లేదంటున్నారు
- తల్లికి వందనం ఎగ్గొట్టి.. నాన్నకు ఇంధనం అందిస్తున్నారు
- ఊరూరా బెల్ట్ దుకాణాలను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మండిపాటు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

**పెందుర్తి:** ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రజలను పూర్తిగా వంచిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే రానున్న ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు ఆరు నెలలు పూర్తి కాకముందే రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ భారాన్ని వేశారని ఆరోపించారు. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ'కాస్త 'బాబు ష్యూరిటీ..వీరబాదుడు గ్యారెంటీ'లా మారిందన్నారు. రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఊరూరా ప్రచారం చేసిన చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచడం మాట అటుంచితే పూర్తిగా విద్యుత్ చార్జీలు తగ్గించి.. ట్రూ అప్ చార్జీలు కూడా ఎత్తేస్తామని నమ్మబలికారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక తాను అలాంటి హామీ ఇవ్వలేదని నిస్సిగ్గుగా బుకాయిస్తున్నారని మండిపడ్డారు. ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. మొత్తానికి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలోనే ప్రజలపై యూనిట్‌కు రూ.2.19 భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను కొనసాగిస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు వారిని కొనసాగించడానికి చట్టబద్ధత లేదని అబద్ధాలు చెబుతూ వలంటీర్ల కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం పేరుతో 'నీకు 15 వేలు.. నీకు 15 వేలు'అంటూ ఊదరగొట్టి ఇప్పుడు ఆ హామీని కూడా తుంగలో తొక్కారన్నారు. మద్యం బెల్ట్ దుకాణాలను నిర్మూలిస్తామని చెప్పి.. ప్రతి గ్రామంలోనూ బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేసేందుకు కూటమి నాయకులు వేలం పాటలు నిర్వహించారని పేర్కొన్నారు. చంద్రబాబు ఏనాడూ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, అలాంటి వ్యక్తికి పవన్‌కల్యాణ్ వత్తాసు పలకడం దారుణమని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రానున్న రోజుల్లో ప్రజల తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మధుపాడ అంజి, రాపర్తి మాధవరావు, మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, బొడ్డు సూర్యప్రకాష్, చిరికి దేముడు, మట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మంచి ఆలోచనతో కృషి చేస్తే లక్ష్య సాధన



మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్ శామ్యూల్ చోంగ్




హాజరైన ధ్యానులు, మాస్టర్లు

**పెందుర్తి:** అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లాలని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ శామ్యూల్ చోంగ్ అన్నారు. పాపయ్యరాజుపాలెంలోని బ్రహ్మర్షి పిరమిడ్ ధ్యాన శక్తి క్షేత్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగులు జీవన విధానంలో ప్రతిరూపాలుగా ఉంటాయన్నారు. పచ్చ రంగు కీళ్ల సమస్యను నివారిస్తుందని, నీలం రంగులో యాంటీబయాటిక్ శక్తి ఉందన్నారు. భారత్‌లో ఎక్కువగా ముదురు రంగులు వాడతారని, దానిపై రీసెర్చ్ చేసేందుకే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. భారత్‌లోని గంగానది నీటిలో ఎనర్జీ ఉందని, దీంతోపాటు పలు నదుల్లోని నీటికి ఎంతో శక్తి ఉందని పేర్కొన్నారు. నిరంతర ధ్యాన సాధన ద్వారా మనిషిలోని శారీరక శక్తి మెరుగవుతుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ధ్యానంతో పాటు శాకాహార భోజనానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. పలు అంశాలపై సూచనలు సలహాలు అందించారు. కేంద్రం నిర్వాహకులు, పలువురు ధ్యాన మాస్టర్లు, ఔత్సాహిక ధ్యానులు పాల్గొన్నారు.

# అధ్వాన డ్రైనేజీలతో అవస్థలు



కలపాకలో మురుగునీటి కాలువపై దట్టంగా పెరిగిన తుప్పలు



బొట్టవానిపాలెం కాలువలో పేరుకుపోయిన చెత్త

**పరవాడ:** మండలంలో కలపాక, రావాడ గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. కలపాక గ్రామంలో ప్రధాన కాలువ పూడికతోపాటు, తుప్పలు, డొంకలు పెరిగిపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోందని స్థానికులు వాపోతున్నారు. గ్రామ సమీపంలోని చెరువులోకి మురుగునీరు పోయేలా ప్రధాన కాలువను నిర్మించారు. కాలువపై అడ్డదిడ్డంగా పెరిగిన తుప్పలు కారణంగా మురుగునీరు చెరువులోకి వెళ్లడం లేదు. మురుగునీటి నిల్వతో దోమలు వ్యాప్తి చెంది, రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు చెప్తున్నారు. రావాడ శివారు బొట్టవానిపాలెంలో మురుగునీరు ప్రవహించే ప్రధాన కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తొలగించకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి




ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, విద్యార్థులు



ఎయిడ్స్ అవగాహన మానవహారంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, గురుకుల పాఠశాల విద్యార్థులు

**పెందుర్తి:** ఎయిడ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టే వరకు పోరాటం చేద్దామని ఐసీటీసీ కౌన్సిలర్ సీహెచ్ సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సామాజిక ఆరోగ్య వైద్య కేంద్రం, ఐసీటీసీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ గురించి యువత పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. విచ్చలవిడి శృంగార అలవాట్లు జీవితాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మెరుగైన, ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రయత్నం చేయాలని సూచించారు. అవగాహనతో ఎయిడ్స్‌ను పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. హెచ్ఐవీ బాధితులను సమాజం నుంచి వెలివేయడం మంచిది కాదన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రిలో, ఐసీటీసీలో ప్రత్యేక చికిత్స, మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాబా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**సబ్బవరం:** ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన, చైతన్యం కలిగి ఉండాలని సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ ఆశ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఐసీటీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని హెచ్ఐవీ వ్యతిరేక నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సెలర్ ఎస్.రాజశేఖర్, సీహెచ్‌వో స్వర్ణలత, ఎంపీహెచ్‌ఈవో కె.జేసుదాస్, వైద్య సిబ్బంది రత్నబాబు, రాంబాబు, శివ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

### 5న సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ట

**సబ్బవరం:** మండలంలోని సబ్బవరం శివారు గొర్లివానిపాలెం ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 5న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, పసిడి కలశ స్థాపన చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చెంనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామితో పాటు అయ్యప్ప, సరస్వతి, నాగబంధ పసిడి కలశ స్థాపన తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6న చండీ హోమం, పూర్ణాహుతి, 7న ఉదయం 8 గంటలకు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని జరపనున్నట్లు వెల్లడించారు. అదే రోజు మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు.

### భైరవుడికి విశేష పూజలు

**సింహాచలం:** అమావాస్యని పురస్కరించుకుని ఆదివారం భైరవస్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఆదివారం, అమావాస్య కలిసిరావడంతో తెల్లవారుజాము 4 గంటల నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. భక్తులతో ఆలయానికి వెళ్లే ఒకటిన్నర కిలోమీటర్ల మార్గం కిటకిటలాడింది.

### 10 నుంచి దివ్యాంగుల రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ



దివ్యాంగుల క్రికెట్ టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌రాజ్ తదితరులు

**సబ్బవరం:** గాజువాక జింక్ గ్రౌండ్‌లో ఈ నెల 10 నుంచి రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ తెలిపారు. ఉరుకూటి చందు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ టోర్నమెంట్ పోటీల గోడపత్రికను సబ్బవరంలోని పార్టీ కార్యాలయంలో సురేష్‌రాజ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 10 జట్ల వరకు పాల్గొంటాయన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సురేష్‌రాజ్ తెలిపారు.